క్లుప్తంగా

మోరపల్లిలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు



సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో బుధవారం కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మోహిజ్ పాషా మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకులో సేవింగ్ ఖాతాలు తీసుకుని, తక్కువ ప్రీమియంతో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఇన్సూరెన్స్ సదుపాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బోల్లె సత్తమ్మ, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, సూపర్ వైజర్ రాకేశ్, సీఈవో వేణు తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావుపేటను మెట్‌పల్లిలోనే కొనసాగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లి: రాజేశ్వర్‌రావుపేట గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న బండలింగాపూర్ మండలంలో చేర్చవద్దని కోరుతూ గ్రామస్తులు బుధవారం ఆర్డీవో కార్యాలయ ఏవో, తహసీల్దార్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. బండలింగాపూర్‌లో కలిపితే గ్రామస్తులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని మెట్‌పల్లి మండలంలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తులు పరిశీలించిన అధికారులు



వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో పుల్లయ్య

పెగడపల్లి: వెనుకబడిన తరగతుల వారు రూ.లక్ష ఆర్థికసాయం కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆర్జీదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎంపీడీవో పుల్లయ్య దోమలకుంటలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 795 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులన్నింటినీ పరిశీలించి జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు.

రైతులకు రుణాలు పంపిణీ



రైతులకు రుణాలు పంపిణీ చేస్తున్న చైర్మన్

జగిత్యాలఅగ్రికల్చర్: స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల కింద కోటి రూపాయల రుణాలను బుధవారం జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వల్పకాలిక రుణాల కింద రూ.40 లక్షలు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.60 లక్షల రుణాలను పంపిణీ చేశామని తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో వేణు, వైస్ చైర్మన్ శీలం సురేందర్, డైరెక్టర్లు పోచమల్లు పాల్గొన్నారు.

జగ్గని ఒర్రె మరమ్మతుకు నిధులు కేటాయించాలి

మల్యాల: మండల కేంద్రంలోని జగ్గని ఒర్రె మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని మల్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామం మధ్యలో ఉన్న ఒగ్గని ఒర్రె మరమ్మతుల కోసం రూ.5 కోట్లు కేటాయించాలని మల్యాల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్ కరీంనగర్ క్యాంప్ ఆఫీస్‌లో వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

చెరువులు పూడ్చేస్తున్నారు..

- ముంపు ప్రాంతాన్ని చదును చేస్తూ సాగు
- హద్దులు ఏర్పాటు చేయని చిన్ననీటి పారుదలశాఖ అధికారులు
- గ్రామాల్లో కనుమరుగవుతున్న చెరువులు, కుంటలు



తిమ్మాపూర్‌లో చదును చేసిన ముప్పాలచెరువు



మోతె ఊర చెరువు వద్ద గంగపుత్రుల నిరసన

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నాటి చెరువులు, కుంటలు రోజురోజుకు మాయమవుతున్నాయి. భూగర్భజలాలు పెంచేందుకు ఉన్న చెరువులు, కుంటలను సమీప ప్రాంతాల్లోని రైతులు, భూ యజమానులు వాటిని పూడ్చివేసి చదును చేస్తూ పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో చెరువులు, కుంటల్లో చెరువు నీటిమట్టాలు తగ్గి దిగువ ప్రాంతంలో ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

కబ్జాలకు గురవుతున్న చెరువులు..

జగిత్యాల రూరల్ మండలంలోని మోతె చెరువు ముంపు ప్రాంతంలో ఇప్పటికే చాలా మంది పూడ్చివేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇటీవల కాలంలో మళ్లీ పూడ్చి వేస్తుండటంతో గంగపుత్రులు చదును చేసిన ప్రాంతంలో వారం రోజుల క్రితం నిరసన చేపట్టారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌లోని ముప్పాల చెరువు, రావుల చెరువును ఇప్పటికే మట్టితో పూడ్చివేసి పంటలు సాగుచేస్తున్నారు. అలాగే జాబితాపూర్ గ్రామంలోని మునుల కుంట, కోటయ్యకుంటలు పూర్తిగా సాగుచేసుకుంటున్నారు. గోవిందుపల్లి శివారులోని తుమ్మలకుంటను పూర్తిగా పూడ్చివేసి పంటలు సాగుచేస్తున్నారు. కన్నాపూర్‌లో జింజిరాల కుంట, జాబితాపూర్‌లోని కాని చెరువు దీంతో పాటు, చాలా గ్రామాల్లోని చెరువులు, కుంటలను పూడ్చివేస్తూ పంటలు సాగుచేసుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

చెరువులకు హద్దులు ఏర్పాటు చేయాలని గంగపుత్రుల ఆందోళన

చెరువులు, కుంటలతో ఉపాధి పొందుతున్న తాము చెరువు కుంటలు పూడ్చివేయడంతో ఉపాధి కోల్పోతున్నామని గంగపుత్రులు అన్ని గ్రామాల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, చిన్ననీటి పారుదల శాఖ అధికారులు ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలను గుర్తించి నక్ష ప్రకారం ముంపు ప్రాంతాలకు హద్దులు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలను రక్షించాలని కోరుతున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలకు హద్దులను ప్రభుత్వాధికారులు ఏర్పాటు చేస్తే ఆక్రమణకు గురికాకుండా ఉంటాయి. ప్రభుత్వం సర్వే నిర్వహించి ఇప్పటికైనా ముంపు ప్రాంతాలకు హద్దులు ఏర్పాటు చేసి గంగపుత్రులకు న్యాయం జరిగేలా చూడాలి.

– బోరె చంద్రయ్య, గంగపుత్రుడు, పోరండ్ల

ఆక్రమణ కాకుండా చర్యలు



జగిత్యాల రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలకు ముంపు ప్రాంతాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నాం. చిన్న నీటి పారుదల శాఖ అధికారులతో సర్వే నిర్వహించి ముంపు ప్రాంతాన్ని గుర్తించి త్వరలో హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపడతాం.

– నవీన్, తహసీల్దార్, జగిత్యాలరూరల్

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడో వార్డు బీజేపీ నాయకుడు దొబ్బల వెంకటేశ్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎస్కే వాజిద్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, మైనార్టీ అధ్యక్షుడు ఫహీమ్, కౌన్సిలర్లు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

డీఎస్పీగా పదోన్నతి పొందిన రాజశేఖర్ రాజు బుధవారం కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు. కోరుట్ల సీఐగా పని చేసిన రాజశేఖర్ రాజు జగిత్యాల ఎస్‌బీ సీఐ గా బదిలీపై వెళ్లి, ఇటీవల పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాజును ఎమ్మెల్యే అభినందించారు.

అయిలాపూర్ పంచాయతీకి ట్రాక్టర్ అందజేత

కోరుట్ల రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిలాపూర్‌కు పంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన రెండో ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర రావు బుధవారం పాలక వర్గానికి అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఒక్క ట్రాక్టర్‌తో చెత్త తొలగించటం, పారిశుద్య అవసరాలకు ఇబ్బందిగా ఉండటంతో మరో ట్రాక్టర్ కొనుగోలు చేశామని సర్పంచ్ పిడుగు రాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ , ఎంపీటీసీ గంగాధర్, కార్యదర్శి నవీన్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

కథలాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధనకు వచ్చే నెలలో హైదరాబాద్‌లో బహిరంగసభ ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బలవంతుల నరేశ్ అన్నారు. బుధవారం మేడిపెల్లి మండలం పోరుమల్లలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. దళిత సంఘాలను ఏకం చేసి ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. హైదరాబాద్ సభకు ప్రతీ గ్రామం నుంచి అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బొమ్మెన కపిల్, నాయకులు మోతె రాజశేఖర్, బంగారు ప్రమోద్, కుంటాల శ్రీనివాస్, శనిగారపు రాజేశ్, సంజీవ్, నవీన్ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల సంచారంతో గ్రామస్తుల అప్రమత్తం

కథలాపూర్: మేడిపెల్లి మండలం కొండాపూర్ గ్రామశివారులో పెద్దమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం రాత్రి ఇద్దరు కొత్త వ్యక్తులు సంచరించినట్లు తెలియడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. ఆలయంలో సమీపంలో ఉన్న ఇద్దరు కొత్త వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతారేమోనని అనుమానించిన గ్రామస్తులు వారిని పట్టుకుని సర్పంచ్ అభిలాశ్‌కు సమాచారమిచ్చారు. ఇతర రాష్ట్రం నుంచి కూలీ పనికి వచ్చామని, మద్యం సేవించినట్లు తెలపడంతో వారిని వదిలిపెట్టారు.

వసతిగృహాల ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించాలి



పుస్తకాలు,దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

మల్లాపూర్: వసతిగృహాల ప్రాధాన్యతను విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలని జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా తల్లిదండ్రులు, సంక్షేమాధికారులు(వార్డెన్లు) కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రత, నాణ్యమైన భోజనంతో పాటు, మెరుగైన ఫలితాలు సాధించేలా మార్గదర్శకం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి గుగ్లావత్ బన్సినాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు ముద్దం శరత్‌గౌడ్, చిట్యాల లక్ష్మణ్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు అనిల్, నాయకులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఫిర్యాదు రాకుండా మీసేవ యాజమానులు పనులు చేయాలని తహసీల్దార్ రవికిరణ్ కుమార్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను బుధవారం మీసేవ యాజమానులు సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేసి వారి మన్ననలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో మీసేవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గూడ రమేశ్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా తాతమ్మ, గంగమ్మకు పూజలు



డప్పుచప్పుళ్లతో వస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తాతమ్మ, గంగమ్మకు గ్రామస్తులు పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యాలను సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పిల్లాపాపలు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగేశ్, ఉపాధ్యక్షుడు పెద్ద రాజం , కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అన్నారు. మండలంలోని మొగిలిపేటలో బుధవారం నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్లగా భారత దేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరాయన్నారు. తెలంగాణలో కేంద్రం అందిస్తున్న నిధులతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు మోకు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పఠనోత్సవాన్ని విజయవంతం చేయాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న సెక్టోరియల్ అధికారి

పెగడపల్లి: పాఠశాలల్లో పఠనోత్సవంను అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి మహేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బతికపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. మన ఊరు–మనబడి కింద చేపట్టిన అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం అమలు తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో క్రమశిక్షణ పెంపొదిస్తూ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన అందించాలన్నారు. ఈ నెల 31 వరకు పఠనోత్సవంను తరగతుల వారీగా నిర్వహించాలన్నారు. హెచ్‌ఎం రవీందర్, సీఆర్పీ రాజమల్లు ఆయన వెంట ఉన్నారు.

రాయికల్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాణి



రాణి



మల్లేశం

రాయికల్: రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పట్టణానికి చెందిన మారంపల్లి రాణి, వైస్ చైర్మన్‌గా సింగరావుపేటకు చెందిన బర్కం మల్లేశం నియామకమైనట్లు సెక్రటరీ రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా అత్తినేని సాయిరెడ్డి (అల్లీపూర్), బత్తిని వెంకటేశ్ (అయోధ్య), రాజన్న (రాజనగర్), ఇర్ఫాన్ అలీ (రాయికల్), కొరిపల్లి స్వామిరెడ్డి (ఇటిక్యాల), సూర విజయ్ (రామాజీపేట), కోల రాజు (రామాజీపేట), ఎలగందుల రమేశ్ (వీరాపూర్), ఉడుత గంగరాజం (కుమ్మరిపల్లి), ఎడ్మల శ్రీధర్‌రెడ్డి (కట్కాపూర్), మాద రమేశ్ (కొత్తపేట), సూర పాపయ్య (ఒడ్డెలింగాపూర్)నియామకమయ్యారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవితకు చైర్‌పర్సన్ రాణి కృతజ్ఞతలు తెలిపారు.

నాసిరకం యూనిఫాం పంపిణీపై ఆగ్రహం



రెండు రంగుల్లో ఉన్న నెక్కర్



విద్యార్థికి అందించిన షర్ట్‌లో రంగుల పరిస్థితి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంలు బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు అందించిన వాటిలో ఒకే షర్ట్ రెండు రంగుల్లో, వెలిసిన రంగుల్లో ఉన్నాయి. నెక్కరు కూడా ఒక పక్క ముదురు ఎరుపురంగు, మరోపక్క వెలిసిన ఎరుపు రంగు బట్ట ఉండటంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనిఫాంలు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు గింత ఘోరమా అంటూ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు నాణ్యత లేని రంగులు వెలిసిన డ్రెస్సులు పంపిణీ చేశారని గ్రామస్తులు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అందరూ భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరి

జగిత్యాలరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో బుధవారం స్వచ్ఛసర్వేక్షణ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం పచ్చదనం విషయంలో ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామపంచాయతీ వారు తడిపొడి చెత్త సేకరణ చేసి కంపోస్ట్ ఎరువు తయారుచేయాలన్నారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ఇంకుడు గుంతల నిర్మాణం కోసం మహిళ సంఘాల కృషి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏళ్ల గంగనర్సు, ఉపసర్పంచ్ పద్మ, ఏపీఎం గంగాధర్, ఏపీవో గంగలక్ష్మణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ధర్మపురి: మండలంలోని బూరుగుపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ కంది తిరుపతి ప్రారంభించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో మంజూరు చేయించిన రూ.10 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి బోరు మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరగా వెంటనే మంత్రి బోరు మంజూరు చేయించారని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కంది విత్తనాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొజన్‌కొత్తూర్‌లో రైతులు పప్పు దినుసుల పంటలను పండించడానికి జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది విత్తనాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి దీపిక రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పప్పు దినుసుల పంటలను పండించడానికి మొగ్గు చూపాలని కోరారు. కంది పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను, చీడ పీడల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల మహేశ్, ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: అక్టోబర్ 1, 2023 వరకు 18 ఏళ్లు నిండిన మండలంలోని యువతి, యువకులు కొత్తగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవికిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బీఎల్‌వోలు కొత్తగా ఓటర్‌గా నమోదు చేసుకుంటారని తెలిపారు.

డీఎస్పీకి ఆత్మీయ సన్మానం

కోరుట్లటౌన్: జగిత్యాల డీఎస్పీగా పదోన్నతి పొందిన రాజశేఖర్ రాజును కోరుట్ల పట్టణానికి చెందిన మాస్టర్ మైండ్ కంప్యూటర్ నిర్వాహకులు బుధవారం సన్మానించారు. జిల్లా స్పెషల్ క్రైమ్ బ్రాంచ్ సీఐగా రాజశేఖర్‌రాజు మెరుగైన బాధ్యతలు నిర్వహించారని, డీఎస్పీ పదోన్నతి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివరాత్రి ప్రసాద్, రక్షిత, హారిక, కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

సీఐ రమణామూర్తికి ..

ధర్మపురి: ధర్మపురి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీఐ రమణామూర్తికి పద్మశాలీ సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ సత్యం, ప్రధాన కార్యదర్శి గడ్డం అనిల్‌బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆడెపు బాబన్న, అశోక్, భోగ రమేశ్ పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో ఉచిత రక్త పరీక్షలు

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్‌ఎస్సీ కాలనీలో 40 మందికి హైదరాబాద్‌కు చెందిన సీసీఎంబీ ల్యాబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ తోట నారాయణ ఆధ్వర్యంలో పరీక్షల రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శారద, ఉప సర్పంచ్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాన్ని అందరూ తెలుసుకోవాలి

మెట్‌పల్లి: భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని శృంగేరి శారదాపీఠం అస్థాన పౌరాణికుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కలియుగంలో మానవులకు శ్రీమద్భాగవతం శ్రవణంతో మోక్షం లభిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు దీని సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. వచ్చే నెల 5 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అందరూ తపాలా బీమా తీసుకోవాలి

సారంగాపూర్: అందరూ తపాలా బీమా తీసుకోవాలని తపాలా సిబ్బంది అన్నారు. సారంగాపూర్‌లో తపాలా శాఖ పరిధిలో రూ. 396 చెల్లిస్తే ఏడాది పాటు బీమా వర్తిస్తుందన్నారు. బీమా చేయించుకున్న వ్యక్తి దురదృష్టవశాత్తు ప్రమాదంలో మరణిస్తే రూ. 10 లక్షలు కుటుంబానికి అందుతుందని, పూర్తి అంగవైకల్యం పొందినా రూ. 10 లక్షలు వర్తిస్తుందనివివరించారు. గ్రామంలో ఎక్కువ సంఖ్యలో బీమా చేయించుకున్నారు.కార్యక్రమంలో బీపీఎం కాలగిరి శ్రీనివాస్‌రెడ్డి, రఘు, నాయకులు కాయితి శేఖర్‌రెడ్డి, గడ్డం మల్లారెడ్డి పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణానికి భూమిపూజ

మల్యాల: మండల కేంద్రంలోని విద్యానగర్‌లో డ్రైయినేజీ నిర్మాణానికి బుధవారం ఎంపీపీ మిట్టపల్లి విమల భూమిపూజ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో నిర్మించే మురికికాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆగంతపు రవళి, వార్డు సభ్యురాలు పోచంపల్లి నీల రాజమల్లయ్య పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ సభ్యుల సహకారంతో నిర్మాణ్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు రూ.10 వేల విలువ గల నోట్ బుక్స్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, నిర్మాణ్ ఫౌండేషన్ ప్రతి నిధి శ్రీధర్, టీచర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని నడికుడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, గైడ్లు, ఇతరసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్,సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్మపురి: మండల లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా మొదటి వైస్ గవర్నర్ కోదండరాం సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిని సత్యనారాయణ, కార్యదర్శిగా అయ్యోరి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా జక్కు దేవేందర్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ జిల్లా కార్యదర్శి మధుసుధన్‌రెడ్డి, రెండో కార్యదర్శి ఎంవి. రమణారెడ్డి, ఆర్‌సి గట్టు రాజయ్య, జోనల్ చైర్‌పర్సన్ భీమనాతి అశోక్, జిల్లా మెంబర్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

వెల్గటూర్ క్లబ్ కమిటీ కార్యవర్గం..

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ కోదందరాం ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి అధ్యక్షుడిగా సిరిపురం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నోముల వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా ముద్దసాని శంకర్, కోశాధికారిగా బండారి చంద్రమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మధుసూధన్‌రెడ్డి, జిల్లా సెకండ్ సెక్రటరీ ఎమ్.వి. రమణారెడ్డి, ఆర్.సి. గట్టు రాజయ్య, జోనల్ చైర్మన్ భీమనాతి అశోక్ కుమార్, లయన్స్ క్లబ్ జిల్లా మెంబర్ జక్కు రవీందర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.